చెప్పారు. అంటే ఏంటో అర్థం కాలేదు. ఒక కంపెనీలో పనిచేస్తూనే మరో కంపెనీకి కూడా పనిచేస్తే.. అంటే, ఒకే సమయంలో రెండు ఉద్యోగాలు చెయ్యడాన్ని 'మూన్ లైటింగ్' అంటారని చెప్పారు. ఆ విధంగా పని చేసేవా ళ్లను పనిలోనుంచి తొలగించారన్నది సమాచారం.

'నిజమే! నిబద్ధత లేనివాళ్లు కంపెనీకి ఎందుకు?' తనను తాను ప్రశ్నించుకుంది శ్రీవల్లి. అప్పటికే వార్తా పత్రికలన్నీ ఈ విషయం మీద చర్చలు ప్రారంభించే శాయి. మూన్ లైటింగ్ విషయంలో కంపెనీలన్నీ రెండు వర్గాలుగా చీలిపోయాయట. కొన్ని కంపెనీలు సమర్థి స్తూంటే మరికొన్ని వ్యతిరేకిస్తున్నాయట. మరికొన్ని షర తులతో కూడిన అనుమతులు ఇస్తున్నాయట. సోషల్ మీడియా ప్రబలమయ్యాక ప్రతీది పబ్లిక్‌గా చర్చించడం, ప్రతిఒక్కరూ తమ అభిప్రాయాలు వ్యక్తం చెయ్యడం పరి పాటి అయిపోయింది. అదేవిధంగా ఈ విషయంలోనూ జరిగింది. ఆరోజు సాయంత్రం ఇంటికి బయల్దేరేముందు సుజాతతో అన్నది శ్రీవల్లి..

"మీరే చెప్పండి.. ఈ మూన్ లైటింగ్ అనేది న్యాయమైనదేనా?''.

"ఎందుకు కాకూడదు? చాలీ చాలని జీతాలతో పనిచేసే వాళ్లు కాస్త అదనపు ఆదాయం కోసం అలా చెయ్యడం తప్పు కాదు కదా!?''.

"అదేంటి మేడం. ఐటీ రంగంలో జీతాలు తక్కువని ఎవరన్నారు? ఐటీ వల్లే.. ఇంతింత జీతాలు కూడా తీసు కోవచ్చా అని ఆశ్చర్యం కలిగింది. మనం తీసుకునే జీతాల్లో సగం కూడా దొరకడం లేదు చాలామందికి. డబ్బులున్నాయని, ఆడంబరాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేసి, అది చాలక ఇంకా సంపాదించాలని అంగలా ర్చడం సరైన పనేనా?''.

సుజాత దగ్గర ఆ ప్రశ్నకు జవాబు లేదు.

"పైగా ఈ ఒక్క రంగంలో మాత్రమే వర్క్ ఫ్రమ్ హోమ్ అనే అవకాశం ఉండేది. నాకు తెలిసి మిగతా ఏ రంగంలోనూ ఇలా చెయ్యలేం. ప్రొడక్షన్, సేల్స్ అంటూ ఏది తీసుకున్నా మనం నేరుగా అక్కడుండి పని చెయ్యా ల్సిందే తప్ప.. వర్క్ ఫ్రమ్ హోమ్ సాధ్యం కాదు. అలాం టప్పుడు మనం చేసే పని నిబద్ధతతో చెయ్యకుండా ఒక టికి రెండు కంపెనీలకు పనిచెయ్యడం తప్పు కాదా!?''.

సుజాత శ్రోతగా మిగిలిపోవడం తప్ప మరేమీ చెయ్య లేకపోయింది. శ్రీవల్లికి ఎందుకో అనుమానం కలిగింది. ఒకవేళ సుజాత కూడా ఎవరికీ తెలియకుండా ఈ మూన్ లైటింగ్ పని చేస్తున్నదా? అదే అనుమానంతో ఆమెవంక అదోలా చూసింది.

అది గమనించిన సుజాత..

"నీ చూపులు నాకు అర్థమయ్యాయి. ఈ ఒక్క ఉద్యో గానికే టైమ్ లేక చస్తూంటే ఇంకో ఉద్యోగం ఎక్కడ చేసేది?'' అన్నది.

అక్కడితో ఆ చర్చకు తెరపడింది.

సాయంత్రం ఇంటికి వెళ్లగానే తండ్రి చెప్పాడు..

"అమ్మాయ్.. ఈ వారంలో పెళ్లివాళ్లొస్తారట. తేదీని ఫిక్స్ చేసుకునేందుకు''.

శ్రీవల్లి ముభావంగా ఉండిపోయింది.

* * *

ఆదివారం ఉదయమే వచ్చాడు శ్రీధర్.. తల్లిదండ్రులతోసహా.

"మరో రెండు నెలల్లో ముహూర్తాలు పెట్టుకుందాం. ఏమంటారు?'' అన్నాడు శ్రీధర్ తండ్రి.

"అలాగే కానివ్వండి'' అంటూ సమ్మతిని తెలియజే శాడు చక్రవర్తి.

"ఐటీ ఇండస్ట్రీ అంతా ఈ మూన్ లైటింగ్ గొడవల్లో ఉంది. అయితే, ప్రస్తుతం మా అబ్బాయికి మాత్రం ఆ సమస్య లేదు. ఎందుకంటే వాళ్ల కంపెనీయే ఆ పద్ధతికి ఒప్పుకొన్నది. కాకపోతే వాళ్ల పర్మిషన్ ఉండాలట. అదేం పెద్ద సమస్య కాదు. వాళ్ల టైమింగ్స్ కాక మిగతా టైమ్‌లో మనమేం చేస్తామన్న విషయం వాళ్లకెందుకండీ?'' అన్నాడు శ్రీధర్ తండ్రి గొప్పగా.

చివాలున శ్రీధర్ వంక చూసింది శ్రీవల్లి.

"అంటే.. మీరు కూడా ఆ విధంగా పని చేస్తు న్నారా?'' అన్నది.

"ఎస్.. ఆఫ్‌కోర్స్! అడిషనల్ ఇన్‌కమ్ అంటే ఎవరికి చేదు? వాళ్ల టైమింగ్ తరువాత నేనేం చేస్తానన్నది నా ఇష్టం కదా!'' అన్నాడు దర్పంగా శ్రీధర్.

"అయితే అది మీరు పనిచేస్తున్న కంపెనీ పట్ల ఇన్సిన్సి యారిటీ కదా?''.

"ఎలాగవుతుంది? ఇప్పుడు స్కూల్లో పనిచేసే టీచర్.. ఆ టైమ్ ముగిశాక ఇంట్లో ట్యూషన్లు చెప్పుకొని సంపా దించడం లేదా? ఇది కూడా అంతే!''.

"అదనంగా ఎంత సంపాదిస్తారు?''.

"మినిమమ్ మరో మూడు లక్షలైనా వస్తుంది ఏడాదికి''.

"ఇప్పుడు మీ ఆఫీస్ టైమింగ్స్ ఏమిటి?''.

"మామూలే.. నైన్ టు ఫైవ్''.

"ఆఫీసుకు పోను రాను ఎంత టైమ్ పడుతుంది?''.

"పర్మనెంట్‌గా వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అప్లయ్ చేశా నుగా.. ట్రావెలింగ్ టైమ్ మిగుల్తుంది''.

"అలా ఒప్పుకొంటారా?''.

"ఏముంది. ఏదో ఒక హెల్త్ రీజన్ చెప్పి, డాక్టర్ సర్టిఫి కెట్ ఇస్తే సరి. లేకుంటే పేరెంట్స్ హెల్త్ రీజన్ కూడా చెప్పొచ్చు. అదేం పెద్ద సమస్య కాదు''.

"మీ ఆరోగ్యం బాగానే ఉందిగా'' అంటూ అదోలా చూసింది.

ఉలికిపడ్డ శ్రీధర్..

"వాట్ డూ యూ మీన్?'' అన్నాడు.

"ఐ మీన్.. వాట్ ఐ సే! బాగా ఆరోగ్యంగా ఉన్న మీరు, నెలకు లక్ష సంపాదించే మీరు, కేవలం మూడు లక్షల కోసం మీ ఆరోగ్యమో, కన్నవాళ్ల ఆరోగ్యమో బాగా లేదని చెప్తానంటున్నారు. ఇక నిబద్ధత ఎక్కడిది? ప్రస్తుతం ఉన్న కంపెనీలో మీకంటూ ఓ స్థానం ఉండే ఉంటుంది. మీమీద నమ్మకం కూడా ఉంటుంది. అలాంటప్పుడు ఆ నమ్మకాన్ని వమ్ముచెయ్యడం తప్పు కాదా!? పోనీ.. అదేం లేదు వాళ్లే పర్మిషన్ ఇచ్చారే అను కుందాం. ఇప్పుడు మీమీదున్న నమ్మకం తరిగిపోదా!? అది కూడా ఫర్వాలేదనుకుందాం. ఇప్పటికే నెలకు లక్ష సంపాదించే మీరు అదనంగా మరో పాతికవేలు దేనికోసం సంపాదిస్తున్నారు?''.

"దేనికంటే.. లైఫ్ ఎంజాయ్ చేసేందుకే కదా! ఐ కెన్ హ్యావ్ మై ఓన్ బంగ్లా, కార్ ఎట్సెట్రా''.

"ఎంజాయ్ చేసేందుకు మీకు టైముంటుందా?''.

"వైనాట్.. కావాల్సినంత''.

"ఎలా ఉంటుంది? ఉదయం నుంచీ సాయంత్రం ఐదు గంటల వరకూ ఇప్పుడున్న కంపెనీ. ఆ తరువాత మరో రెండు మూడు గంటలు మరో కంపెనీ. అంటే రాత్రి ఎనిమిది గంటలు అవుతుంది. ఆ లెక్కన.. వీకెం డ్స్‌లో కూడా ఎక్స్‌ట్రా పని ఉంటుంది. ఇక అనుభవిం చేందుకు టైమెక్కడిది మీకు?''.

శ్రీధర్ అవాక్కయ్యాడు. అతనివద్ద జవాబు లేదు. శ్రీవల్లి ఇలా నిలదీస్తుందనుకోలేదు.

"ఇక్కడ అన్నిటికన్నా ముఖ్యం నిబద్ధత. లాయల్టీ! మీరు నన్నేమనుకున్నా సరే.. నేను చెప్పదల్చుకున్నది చెప్పి తీరాలి. లక్ష జీతం వచ్చినా, చాలదని మరో కంపె నీలో కూడా పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. మీరు చేసే పనికీ, సంసార సుఖం చాల్లేదని ఒక ఇల్లాలు ఉండ గానే మరో ఇల్లు చూసుకునేందుకు పెద్ద తేడాలేదు. నాన్నగారూ.. ఈ సంబంధం వద్దండీ. ప్లీజ్!'' అన్నది.

చెళ్లున చెంపమీద చరిచినట్లయ్యింది. శ్రీధర్ తల్లిదం డ్రులు కూడా అవాక్కయి ఉండిపోయారు.

"మరో ముఖ్యమైన విషయం. ప్రస్తుతం మీరు మనసు మార్చుకున్నా, ఇక ఈ సంబంధం కుదరదు. ఎందుకంటే ఈ సంఘటన మనసు మూలల్లో జీవి తాంతం మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. అటు వంటి పరిస్థితుల్లో మనిద్దరం ఒక్కటవడం సరైన పని కాదు. ఒకరికి ఒకరన్నది జీవన సూత్రం. అది ఉద్యోగ మైనా.. సంసారమైనా! ధన్యవాదాలు''.. అంటూ లేచి నిలబడి చేతులు జోడించింది శ్రీవల్లి.

చక్రవర్తి దంపతులు ప్రేక్షకులయ్యారు.

శ్రీధర్ కుటుంబం మౌనంగా నిష్క్రమించింది.

**బాగా ఆరోగ్యంగా ఉన్న మీరు, నెలకు లక్ష సంపాదించే మీరు, కేవలం మూడు లక్షల కోసం మీ ఆరోగ్యమో, కన్నవాళ్ల ఆరోగ్యమో బాగాలేదని చెప్తానంటున్నారు. ఇక నిబద్ధత ఎక్కడిది? ప్రస్తుతం ఉన్న కంపెనీలో మీకంటూ ఓ స్థానం ఉండే ఉంటుంది. మీమీద నమ్మకం కూడా ఉంటుంది. అలాంటప్పుడు ఆ నమ్మకాన్ని వమ్ముచెయ్యడం తప్పు కాదా!?**

## సింగీతం ఘటికాచల రావు



పన్నెండో ఏటే ఛందోబద్ధమైన కవిత్వంతో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు సింగీతం ఘటికాచల రావు. వీరి స్వస్థలం నెల్లూరు. ప్రస్తుతం చెన్నైలో ఉంటున్నారు. 1981లో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా చేశారు. చెన్నైలోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా విరమణ చేశారు. బాల్యం నుంచే వివిధ పత్రికల్లో కథలు, సీరియల్స్ చదువుతూ.. కథలు రాయడం మొదలుపెట్టారు. 1997లో 'ఐదు పైసలు' శీర్షికతో సింగిల్ పేజీ కథ రాసి స్వాతి సపరివార పత్రికకు పంపగా.. తొలి పారితో షికంగా యాభై రూపాయలు అందుకున్నారు. ఇప్పటివరకూ 130 కథలు, 15 నవలలు ప్రచురించారు. వీరి మొదటి నవల మనసున మనసై. 1997లో స్వాతి మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైంది. అజాత శత్రువు, రాగ విపంచి, సారేజహాసే అచ్చా నవలలు పాఠకుల మన్ననలు పొందాయి. సాహిత్య సేవలో భాగంగా అనేక బహుమతులు, సన్మానాలు అందుకున్నారు.